క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకుడు రాంబాబు స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీపీటీడీ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.జె.సుభాకర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ డిపోలో రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బీకే మూర్తి, కోశాధికారి జి.తాటాలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న అరుణశ్రీ

బలిజిపేట: మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి అరుణ శ్రీ తెలిపారు. బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు, గృహహింసలు, ఈవ్‌టీజింగ్‌లు నిత్యం జరుగుతున్నాయన్నారు. వీటినుంచి రక్షణపొందేందుకు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సీడీపీఓ సులేఖ, ఎస్‌ఐ సింహాచలం, ఏపీఎం ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు డి. లక్ష్మి దీపవల్లి, ఎస్.ప్రేమలత పాల్గొన్నారు.

వీఆర్‌ఎస్ ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక



ఎన్నికైన సభ్యులకు అభినందనలు

మక్కువ: మండలంలోని వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు చైర్మన్ ఎన్నికను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో ఏడు సంఘాలకు, చెరువుల పరిధిలో మూడు సంఘాలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించగా వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ చైర్మన్‌గా తూరు మామిడి గ్రామానికి చెందిన మత్స గోదావరి, వైస్ చైర్మన్‌గా కవిరిపల్లి గ్రామానికి చెందిన పెంట సత్యం ఎన్నికయ్యారు. వీఆర్‌ఎస్ డీఈఈ డి.సురేష్, జేఈలు తిరుపతిరావు, రాజశేఖర్ రెడ్డి, ప్రశాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: బాగువలసలో జగనన్న జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి తదితరులు



సాలూరు: కందులపథంలో జగనన్న జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు

సంక్షేమ ప్రదాత జగన్



పార్వతీపురం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- 1.60 కోట్ల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనదే...
- నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేసిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతపురంటౌన్:

సంక్షేమ ప్రదాత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన పాలనలో 1.60 కోట్ల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కూడలి వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో శనివారం కేక్‌కట్ చేసి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పాలన అందిస్తే.. నేడు ఆయా వర్గాలను కూటమి ప్రభుత్వం క్షోభకు గురిచేస్తోందని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రజలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలని గట్టిగా చెబుతున్నారన్నారు. చంద్రబాబు చేతిలో మోసపోయామంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వాకాడ నాగేశ్వరరావు, పట్టణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీలు మామిడి బాబ్జి, అలజంగి రవికుమార్, బలగ నాగేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, బి.రవికుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



సీతానగరం: లక్ష్మీపురంలో జగనన్న జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు



బలిజిపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న నాయకులు

సీతానగరం: మండల కేంద్రంలో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు, నాయకుడు బి.శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండలాధ్యక్షుడు బి.చిట్టిరాజు కేక్‌కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు.

బలిజిపేట: పార్టీ మండలాధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో బలిజిపేట బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైస్ ఎంపీపీ వి.సాయిరాం, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

ఏ ఎన్నికలొచ్చినా.. వైఎస్సార్‌సీపీదే అధికారం

సాలూరు: రాష్ట్రంలో జమిలి లేదా సాధారణ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో గెలవడం ఖాయమని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు రాజన్నదొర ఆధ్వర్యంలో పట్టణంలో తన స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ, వలంటీరు వ్యవస్థల ద్వారా తీసుకువచ్చారని అన్నారు. నీతి, నిజాయితీ, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు చేసిన జననేత జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు.



సీతానగరం మార్కెట్‌లో కేక్ కట్‌చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు



సాలూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ శ్రేణులు

ఘనంగా గణిత దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా శనివారం నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ కనుగొన్న గణిత సిద్ధాంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్, గణిత ప్రాజెక్టు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కరుణ్, శ్రీనివాసరావు, సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా సహిత విద్య విభాగంలో ఓరియంటేషన్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుపతి నాయుడు

పార్వతీపురం టౌన్: జిల్లా సహిత విద్య విభాగంలో ఓరియంటేషన్ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులకు శనివారం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుపతి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగుల పిల్లల స్థితిగతులను తెలుసుకోవడం ద్వారా వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పదో తరగతి చదువుతున్న దివ్యాంగులు పిల్లలకు పబ్లిక్ పరీక్షల్లో ఏ విధమైన రాయితీలు, మినహాయింపులు ఉన్నాయో వివరించారు. ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ జిల్లాలో ఇంకా బాగా జరగాలని ఏ విద్యార్థి డ్రాప్ అవుట్ లేకుండా పాఠశాలలో నమోదు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలన్నీ అందించే విధంగా మండల విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. డాక్టర్ జగన్‌మోహన్, స్టేట్ అబ్జర్వర్ అమ్మి నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ భానుమూర్తి, జిల్లా రిసోర్స్ పర్సన్‌గా రాయిడి శంకరావు, మండల విద్యాశాఖాధికారులు, డీఈఐసీ సిబ్బంది ఉదయ్ కుమార్, స్రవంతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్య ప్రయోజనాలు అధికం



అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో ధ్యానం చేస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

పార్వతీపురం టౌన్: ధ్యానంతో ఆరోగ్య ప్రయోజనాలు అధికమని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మంచుపల్లి శ్రీరాములు అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా స్థానిక ఏపీఎన్‌జీఓ హోమ్‌లో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అంటే కేవలం ఆసనాలే కాదు, ధ్యానం కూడా యోగాలో భాగమేనన్నారు. ధ్యానం వలన మనం రోజంతా ప్రశాంతంగా ఉండవచ్చన్నారు. ధ్యానం వలన స్ట్రెస్, టెన్షన్, కోపం, బీపీ తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. బ్రహ్మకుమారి ఓంశాంతి నిర్వాహకులు జ్ఞానరత్నం, యోగా గురువు జామి భాస్కరరావు ధ్యానం ఎలా చేయాలో వివరించారు. యోగా గురువు, జిల్లా సెక్రటరీ మోహన్ గంతాయాత్ ఏపీఎన్‌జీఓ ప్రెసిడెంట్ కిషోర్, జయబాబు, మెహర్, వినయ్, బి.రామకృష్ణ, యోగా గురువులు గౌరీశంకర్, పార్వతీశం, మురళీ, త్రినాధ్ హాజరయ్యారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



మాజీ ఎమ్మెల్యే జోగారావును సత్కరిస్తున్న జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ

పార్వతీపురం టౌన్: పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల జిల్లా మైనార్టీ సెల్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పార్వతీపురం పురపాలక సంఘానికి చెందిన సీనియర్ నాయకులు షేక్ షఫీ, సరివిట్టి శ్రీనివాసులు ఇరువురినీ నియామకం చేసిన సందర్భంగా శనివారం వారు మాజీ ఎమ్మెల్యే జోగారావుని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీలో కష్టపడిన ప్రతీ ఒక్క నాయకునికి పార్టీలో సముచిత స్థానం ఇచ్చి గౌరవించుకోవడం జరుగుతుందన్నారు. నాయకులంతా కష్టపడి పని చేసి భవిష్యత్‌లో వైస్ జగన్ నాయకత్వంలో ప్రజల తరఫున పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. ప్రాణాలు కాపాడారు..!



రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ వ్యక్తి

పార్వతీపురం టౌన్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని పార్వతీపురం జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడారు. జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నాకర్ తెలిపిన వివరాలు.. స్థానిక బైపాస్ కాలనీకి చెందిన బి.తిరుపతిరావు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు బెలగాం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం పట్టాలపై పడుకున్నాడు. అతన్ని గమనించిన గూడ్స్ గార్డు స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావుకు సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది బీఎస్ కృష్ణ పాల్గొన్నారు.

● గోదాదేవి తిరువీధి



సీతానగరం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి శనివారం అర్చకులు భరత్ ఆధ్వర్యంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోవింద మాలధారులు అమ్మవారికి పూల అలంకరణ చేసి మేళ తాళాలతో పల్లకిలో తిరువీధి జరిపారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. – సీతానగరం

● భూమి పూజ



సీతానగరం మండలం హనుమాన్ కూడలి వద్ద ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మాణానికి రాష్ట్ర రవాణాశాఖమంత్రి రాంప్రసాద్ రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ దూర ప్రాంతాల నుంచి సీతానగరం కూడలి వద్దకు వచ్చిన ప్రయాణికులు విశాఖ, రాజమండ్రి, విజయవాడ, రాయగడ ప్రాంతాలకు రాకపోకలు చేస్తున్నారని, వీరు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా షెల్టర్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.విజయచంద్ర పాల్గొన్నారు. – సీతానగరం

తుఫాన్ మిగిల్చిన విషాదం



నీటి మధ్యలో వరి కుప్పలు



వరిచేలపై నుంచి పారుతున్న నీరు

తుఫాన్ అన్నదాత వెన్ను విరిచింది. సాలూరు మండలంలో గడిచిన ఐదు రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరుగా కురిసిన వర్షాలు రైతులను నష్టాల నట్టేట ముంచాయి. పంట చేలు కోతలు కోసి పొలంలో కుప్పలు వేయగా నిండా మునిగాయి. పలుచోట్ల నూర్చిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ఖరీఫ్ వరి దిగుబడులు ఆశాజనకంగా ఉండి కోతలు కోసి ఇళ్లకు చేర్చే సమయంలో ఇలా తుఫాన్ విషాదం మిగల్చడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సకాలంలో తమ దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట దిగుబడులు ఇలా వర్షార్పణం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

– సాలూరు రూరల్



మొలకలు చూపిస్తున్న రైతు

దళితుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

పార్వతీపురంటౌన్: దళితులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జి.జనార్దన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితులను ఆర్థికంగా, సామజికంగా, రాజకీయంగా ఎదిగేలా తోడ్పాటు ఇవ్వాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని దళితులకు మాత్రమే రాశారన్న భ్రమలో అగ్రకులాల వారు ఉండడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు దక్కాల్సిన హక్కులు, ఫలాలు అందకుండా హరిస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, సన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.